# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 01 ఆగష్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 04

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





**చర్చ లేకుండానే మండలిలో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం**

- కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- నన్ను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని సబిత ఆవేదన
- 'తమ్ముడూ' అంటూనే ఆమె మోసం చేశారని సీఎం వ్యాఖ్య
- ఆమె పార్టీ మారి నాకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేశారు: భట్టి
- సీఎం వ్యాఖ్యలపై భారాస సభ్యుల అభ్యంతరం
- క్షమాపణకు పట్టు
- ఇరుపక్షాల వాదోపవాదాలతో శాసనసభలో గందరగోళం
- నిరసనల మధ్యే ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

# మీ వెనకున్న అక్కల్ని నమ్మొద్దు



హైదరాబాద్: అరుపులు.. కేకలు.. గందరగోళ పరిస్థితుల మధ్య ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. తమ సభ్యురాలిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ భారాస సభ్యులంతా ఆందోళనకు దిగడంతో మధ్యాహ్నం ఒకటిన్నరకు వాయిదా పడ్డ సభ మూడున్నర గంటలకు తిరిగి ప్రారంభమైనా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో నిరసనల మధ్యే తదుపరి చర్చ, సమాధానం లేకుండా ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందింది. బుధవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్ష భారాస తరపున కేటీఆర్ మాట్లాడారు. ఈ సమయంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య పలు దఫాలు వాదోపవాదాలు జరిగాయి. కేటీఆర్ మాట్లాడుతుండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని 'వెనక ఉన్న అక్కల మాట వింటే మీ పరిస్థితి జూబ్లీ బస్టాండే' అంటూ వ్యాఖ్యానించారు. దీంతో భారాస సభ్యులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ సభ్యులు కూడా గట్టిగా మాట్లాడారు. తనను లక్ష్యంగా చేసుకొని ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, కాంగ్రెస్‌లోకి వస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత స్థానానికి చేరుకుంటారని చెప్పానని సబితా ఇంద్రారెడ్డి పేర్కొనగా.. మీ పేరును ముఖ్యమంత్రి ప్రస్తావించలేదని మంత్రి సీతక్క సమాధానమిచ్చారు. వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరడంతో సీఎం మళ్లీ జోక్యం చేసుకొని.. 'మా మధ్య జరిగిన చర్చను సబితా ఇంద్రారెడ్డి బయటపెట్టారు. ఆమె చెప్పింది వాస్తవమే. ఎంపీగా పోటీకి దిగాలని నన్ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన ఆమె.. ఆ తర్వాత భారాసలోకి వెళ్లి వ్యతిరేకంగా పనిచేశారు. ఆ ఉద్దేశంతోనే నమ్మొద్దని అన్నాను. గవర్నర్‌కు ఆహ్వానం పలకడానికి వెళ్లాల్సి ఉంది. ఈ అంశంపై తర్వాత చర్చకు సిద్ధమే' అని అన్నారు. 'తమ్ముడూ' అంటూనే సబితా ఇంద్రారెడ్డి తనను మోసం చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తానేం మోసం చేశానని, కాంగ్రెస్‌లోకి వస్తే భవిష్యత్తు ఉంటుందని చెప్పానని, తనను ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థం కావడం లేదని సబిత ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క జోక్యం చేసుకుంటూ.. సబితా ఇంద్రారెడ్డి పార్టీ మారి తనకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేశారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, సబితపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాల్సిందేనని భారాస సభ్యులు పట్టుబట్టారు. సభ్యుల్ని రెచ్చగొట్టవద్దని, తర్వాత సబితా ఇంద్రారెడ్డికి మాట్లాడే అవకాశం ఇస్తానని కేటీఆర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. అయినా గొడవ సద్దుమణగకపోవడం.. ఇరువైపులా వాదోపవాదాలు తీవ్రం కావడంతో సభను స్పీకర్ వాయిదా వేశారు.

మాట్లాడే అవకాశం ఇవ్వాలని భారాస నిరసన

మధ్యాహ్నం సభ ప్రారంభం కాగానే భారాస సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. ఆయన అనుమతించకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచన మేరకు భాజపాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడటం మొదలుపెట్టగానే భారాస సభ్యులంతా లేచి తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడిన తర్వాత మైక్ ఇస్తానని స్పీకర్ చెప్పడంతో భారాస సభ్యులు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లారు. ముందుజాగ్రత్త చర్యగా పెద్దసంఖ్యలో మార్షల్స్‌ను సభలోకి పిలిపించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో భారాస సభ్యులు పెద్దగా కేకలు పెట్టడంతో కొద్దిసేపు సభలో ఏం జరుగుతుందో అర్థం కాలేదు. మజ్లిస్ సభ్యుడు అక్బరుద్దీన్ జోక్యం చేసుకుని మాట్లాడుతూ.. సబితా ఇంద్రారెడ్డి పేరు ప్రస్తావించినందువల్ల ఆమెకు మాట్లాడే హక్కు ఉంటుందని, ఆమెకు మైక్ ఇవ్వడం సమంజసమని అన్నారు. అయినా భారాస సభ్యులు ఆందోళన కొనసాగించడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ను ఉద్దేశించి.. 'మీలా నేను మాట్లాడలేను. దయచేసి కూర్చోండి' అని సూచించారు.

# విద్యార్థుల దుర్మరణం పై విచారణ

**అధికారులు ఎవరైనా జైలుకు వెళ్లారా మున్సిపల్ అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం**

**న్యూఢిల్లీ:** రావూస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి చెందిన ఘటనలో మున్సిపల్ అధికారుల తీరుపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇప్పటివరకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఉచితాలకు ప్రాధాన్యం ఇస్తే ఇలాంటి పరిణామాలే ఎదుర్కోవాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. విద్యార్థుల మరణాలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తాజాగా విచారించింది. ఈనేపథ్యంలో అధికారుల తీరును తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ.. పన్నులు వసూలుచేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. బాటసారులపై పోలీసుల చర్యలు ఉంటాయి. కానీ, ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ) అధికారులపై లేవంటూ విమర్శించింది. పట్టణ నిర్వహణ ప్రణాళికపై అధికారులను ప్రశ్నించింది. మీరు ఈ కేసులో జూనియర్ అధికారులను అయితే తొలగించారు. కానీ, పర్యవేక్షించాల్సిన సీనియర్ అధికారుల సంగతేంటి? ఎంసీడీ నుంచి ఎవరైనా జైలుకు వెళ్లారా?' అని కోర్టు ప్రశ్నించింది. కోచింగ్ సెంటర్‌లో సంభవించిన ఈ మరణాలపై విచారణను కేంద్ర ఏజెన్సీకి బదిలీ చేయాలని సూచనప్రాయంగా పేర్కొంది.




# గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

**ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే**



**హైదరాబాద్:** తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. ఆయనతో ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎస్ శాంతి కుమారి తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం సిఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం మంత్రులు, పలువురు నేతలు అభినందనలు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. తరవాత గవర్నర్‌తో సిఎం, మంత్రులు గ్రూప్ ఫోటో దిగారు. ఆ తదుపరి హై టీలో విఐపిలు పాల్గొన్నారు. 1957 ఆగస్టు 15న జన్మించిన జిష్ణుదేవ్ వర్మ.. త్రిపుర రెండో ఉప ముఖ్యమంత్రిగా 2018 నుంచి 2023 వరకు పని చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ సేవలందించారు. ఆయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో 1990లో భాజపాలో చేరారు. తెలంగాణ భాజపా నేత ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులుకాగా, ఆ రాష్ట్రానికి చెందిన నాయకుడు తెలంగాణ గవర్నర్‌గా రావడం విశేషం.



**సింగరేణి ప్రైవేటీకరణ సమస్యే లేదు**

2లో



**ఆరోగ్యశ్రీని నిలిపివేసే ఆలోచన ఉందా?**

2లో



**హైదరాబాద్‌కు భారీ వర్ష ముప్పు**

2లో



**హత్యాచారం కేసులో దోషికి మరణశిక్ష**

2లో

# వరద మృతులపై స్పందించిన రావూస్

**ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో పోస్ట్**

**న్యూఢిల్లీ:** బిల్డింగ్ బేస్‌మెంట్‌లో వరద నీరు ముంచెత్తి ముగ్గురు ఐఏఎస్ ఆశావహులు మృతి చెందిన కేసులో పోలీసు విచారణను ఎదుర్కొంటున్న రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఎట్టకేలకు బుధవారంనాడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించింది. తమ ముగ్గురు స్టూడెంట్ల మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈనెల 27న జరిగి విషాద ఘటనలో మా విద్యార్థులు తానియా సోని, నివిన్ డాల్విన్, శ్రేయ యాదవ్ ప్రాణాలు కోల్పోవడం మమ్మల్ని విచారంలో ముంచెత్తింది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ ఘటనపై ప్రస్తుతం జరుగుతున్న విచారణకు మేము పూర్తిగా సహకరిస్తాం. ఇలాంటి క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం. వారి కలలు, అంకితభావం ఎప్పటికీ గుర్తిండిపోతాయని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ 'ఎక్స్' పోస్టులో పేర్కొంది. కాగా, ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

బేస్‌మెంట్ యజమానులైన పర్వీందర్ సింగ్, సర్వజిత్ సింగ్, హర్వీందర్ సింగ్, తేజేందర్ సింగ్‌లకు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ తీజ్ హజారీ కోర్టు నిరాకరించింది. ఓల్డ్ రాజేందర్ నగర్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో విద్యార్థుల మృతి ఘటనలో వీరు నిందితులుగా ఉన్నారు. కారు ఓనర్ మనోజ్ కథురియా బెయిల్ అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఓల్డ్ రాజేంద్ర నగర్‌లోని వరద నీటిలో కథూరియా తన సువ్ కారును నడపడంతో ఆ నీరు గేట్లను తోసుకుంటూ బేస్‌మెంట్‌ను ముంచెత్తింది. ఈ ఘటనలో ఢిల్లీ పోలీసులు రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఓనర్, కోఆర్డినేటర్ సహా ఏడుగురిని అరెస్టు చేసింది. పార్లమెంటునును సైతం ఈ ఘటన కుదిపేసింది.




వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ


# చర్చ లేకుండానే మండలిలో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం



హైదరాబాద్: శాసనమండలిలో ఎలాంటి చర్చ లేకుండానే ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందింది. బిల్లు ప్రవేశపెట్టడం.. ఆమోదం పొందడం.. సభ గురువారానికి వాయిదా పడటం అన్నీ కొద్ది క్షణాల వ్యవధిలోనే జరిగిపోయాయి. బుధవారం ఉదయం సభ ప్రారంభం అయ్యాక తొలుత 'ప్రత్యేక అంశం'పై పలువురు సభ్యులు మాట్లాడారు. 11 గంటలకు వాయిదాపడ్డ మండలి ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. అప్పుడు సభలో స్వల్ప సంఖ్యలోనే సభ్యులు ఉన్నారు. శాసనసభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని.. ఈ విషయంపై మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలంటూ భారాస సభ్యురాలు వాణీదేవి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. భారాస పక్షనేత మధుసూదనాచారి కూడా లేచి మాట్లాడేందుకు అనుమతివ్వాలని కోరారు. అది శాసనసభలో జరిగిన విషయమని.. ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు.

## సింగరేణి ప్రైవేటీకరణ సమస్యే లేదు



**న్యూఢిల్లీ:** సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని పార్లమెంట్ వేదికగా కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ వేదికగా ఇటీవల ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి మౌఖికంగా సమాధానం ఇచ్చారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా 51శాతం, కేంద్ర ప్రభుత్వం వాటా 49శాతం ఉందని.. కేంద్రం సింగరేణిని ఎలా ప్రైవేటీకరిస్తుందని ప్రశ్నించారు. తాజాగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సింగరేణి అంశంపై ప్రశ్నించారు. దీనికి కేంద్రమంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గనుల కేటాయింపులో పారదర్శకత ఉండేందుకే వేలం ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ఇందులో ప్రభుత్వాలతోపాటుగా ప్రైవేటు సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచనేదీ కేందప్రభుత్వానికి లేదని పార్లమెంటు వేదికగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. 24 జూలై నాడు పార్లమెంటు వేదికగా ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మౌఖికంగా సమాధానం ఇచ్చారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం, కేందప్రభుత్వం వాటా 49 శాతం ఉండగా.. కేంద్రం సింగరేణిని ఎలా ప్రైవేటీకరిస్తుందని అన్నారు. ఇదే ప్రశ్నను.. బుధవారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడగగా కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గనుల కేటాయింపులో పారదర్శకత ఉండేందుకే వేలం ప్రక్రియను చేపడుతున్నామని, ఇందులో ప్రభుత్వాలతో పాటుగా ప్రైవేటు సంస్థలు కూడా పాల్గొంటాయని చెప్పారు. కేంద్ర బ్జడెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇచ్చి వివిధ రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.9,151 కోట్లు కేటాయించినందుకు ప్రధాని మోదీకి మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ధన్యవాదాలు తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు రావాలని, రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే అభివృద్ధి పనుల నిమిత్తం మరిన్ని నిధులు కావాల్సిన అవసరం ఉందని

ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మచిలీపట్నం – నర్సాపురం రైల్వే లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ముఖ్యంగా మచిలీపట్నం – రేపల్లె రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ లైన్‌ను నిర్మిస్తే దివిసీమ ప్రజానీకానికి ఉపయోగకరంగా ఉంటుందని అభిలాష వ్యక్తం చేశారు. గుడివాడ నియోజకవర్గం వడ్లమన్నాడు రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్లకు స్టాప్‌లు ఇవ్వాలని ఎంపీ బాలశౌరి కోరారు. గతేడాది అక్టోబర్‌లో నిలిచిపోయిన మచిలీపట్నం నుంచి తిరుపతి వయా ధర్మవరం రైలు సర్వీసును భక్తుల కోరిక మేరకు పునరుద్దరించాలని ఎంపీ బాలశౌరి అభ్యర్థించారు.

## ఆరోగ్యశ్రీని నిలిపివేసే ఆలోచన ఉందా?



**న్యూఢిల్లీ:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మధ్య ట్విట్టర్ వార్ నడుస్తోంది. ఆయుష్మాన్ పథకమే ఇక అమలు చేయాలని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వానికి ఆరోగ్యశ్రీని నిలిపివేసే ఆలోచన ఉందా? అందుకే పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు ఎందుకంత జాప్యం చేస్తున్నారని వైఎస్ షర్మిల నిలదీయడంపై పెమ్మసాని మండిపడ్డారు. ఏపీ ప్రజలను షర్మిల దారి మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తున్నట్లు తెలిపారు.ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం ఆరోగ్యశ్రీకి ప్రత్యామ్నాయం కాదని పెమ్మసాని వెల్లడించారు. ఇది ఆరోగ్యశ్రీకి ప్రత్యామ్నాయం కాదని ప్రజలకు వైద్య సేవలను విస్తరించేందుకు తీసుకొచ్చిన పథకమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ రాజకీయపూరిత కుట్రలకు బలికావద్దని ఏపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని ట్వీట్‌పై షర్మిల సీరియస్ అయ్యింది. తాను ప్రజలను పక్కదారి పట్టించడానికి మాట్లాడి ఉంటే మిమ్మల్ని సమాధానం ఎందుకు అడుగుతానని ప్రశ్నించింది.

మీ పత్రికా సమావేశంలో ప్రజలకు అనుమానాలు తలెత్తాయని.. అవి తమ దృష్టికి రావడంతో తాను స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వమని అడగడం జరిగిందని షర్మిల తెలిపారు. రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన నేతగా.. ' ఆరోగ్యశ్రీకి డబ్బులు లేవు.. ఆస్పత్రులకు బిల్లులు రావడం లేదు.. పేషెంట్లకు వైద్యం అందడం లేదు.. అందుకే ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ కార్డులు తీసుకోండి.' అని మీరే ఆరోగ్యశ్రీ పథకం కొనసాగింపుపై అనుమానాలు కలిగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపే

వాళ్లే బాధ్యతారాహిత్యమైన కామెంట్స్ చేయొచ్చా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఆరోగ్యశ్రీని.. అనారోగ్యశ్రీ చేయకుండా పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆటంకాలు రాకుండా కొనసాగించాలని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామని ఎన్డీయే కూటమి ఎన్నికల హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇది ఎప్పటిలోగా అమలు చేస్తారో కూడా ప్రజలకు వివరించాలని అడిగారు.

## హైదరాబాద్‌కు భారీ వర్ష ముప్పు



**హైదరాబాద్:** భాగ్యనగరానికి వరదల ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. జులైలో భారీ వర్షాలతో అల్లాడిన హైదరాబాద్ వాసులకు మరో గండం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ఆగస్టు నెలలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అధికారులు బుధవారం తెలిపారు. ముఖ్యంగా ఆగస్టు చివరిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 15 నుంచి 30 మధ్యకాలంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. భారీ వర్షాల కారణంగా అసిఫాబాద్‌లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటివరకు హైదరాబాద్‌లో 282.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం (280.7 మిల్లీమీటర్ల) కంటే స్వల్పంగా ఎక్కువ వర్షపాతం నమోదైందన్నమాట. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ఎ÷–లానింగ్ సొసైటీ డేటా ప్రకారం జూన్ మొదటి రెండు వారాల్లో భారీ వర్షాలు కురిశాయి. జూన్ చివరి వారంలో అధిక వర్షపాతం నమోదైంది. జులైలో సాధారణం నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. జులై చివరివారంలో లోటు వర్షపాతం నమోదైంది. ఇక తెలంగాణలో రానున్న 2 రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గడిచిన వారం పదిరోజులుగా రాష్ట్రంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలన్ని నిండు కుండలను తలపిస్తున్నాయి. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులు నిండుతుండటంతో అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. నిర్మల్, పెద్దపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# రాజకీయ చర్చలతో దద్దరిల్లిన అసెంబ్లీ

<ins>ఫిరాయింపులపై సబితతో ఫిర్యాదును ప్రస్తావించిన సీతక్క</ins>

<ins>తనను టార్గెట్ చేస్తున్నారంటూ సబిత ఆగ్రహం</ins>

<ins>సబిత మోసం చేసింది నిజమే అన్న సిఎం రేవత్</ins>

<ins>కాంగ్రెస్‌ను మోసం చేసిన ఘనత మీదే అన్న భట్టి</ins>

<ins>దళితుడు విపక్షనేత కాకుండా చేశారని ఆగ్రహం</ins>



**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో మాటల యుద్ధంతో ద్దరిల్లింది. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో రాజకీయాలుఎ చోటు చేసుకున్నాయి. మొదట.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వర్సెస్ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులుగా సుమారు గంటకుపైగానే సభ నడవగా ఆ తర్వాత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రస్తావన వచ్చింది. సభలో పార్టీ మార్పులపై వాడి వేడిగా చర్చ నడుస్తుండగా పెద్ద రచ్చే అయ్యింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఇద్దరూ కౌంటర్ల వర్షం కురిపించారు.మంత్రి సీతక్క భారాసపై ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని భారాస నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు పత్రాన్ని కాంగ్రెస్‌లో గెలిచి భారాసలోకి వచ్చిన సబితా ఇంద్రారెడ్డితో ఇప్పించారని ఎద్దేవా చేశారు. భారాస వాళ్లు రాజీనామా చేయించి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారా అని ప్రశ్నించారు. ఈక్రమంలో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు తనను టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని.. ఓ అక్కగా కాంగ్రెస్‌లోకి సంతోషంగా ఆహ్వానించినట్లు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డికి నాపై ఎందుకు కక్ష?. ఆరోజు పార్టీలోకి వచ్చినప్పుడు కాంగ్రెస్ ఆశాకిరణం అవుతావని చెప్పాను. సీఎం అవుతావని కూడా చెప్పాను. మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను అని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సబితక్క నన్ను పార్టీలోకి ఆహ్వానించిన మాట వాస్తవం. వ్యక్తిగతంగా జరిగిన సంభాషణ సభలో చెప్పారు. సబిత సభలో ప్రస్తావించారు కాబట్టే.. అప్పుడు జరిగిన పరిణామాలు సభలో చెప్పాలి. 2019లో మల్కాజిగిరిలో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే అండగా ఉంటానని సబితక్క మాట ఇచ్చారు. కాంగ్రెస్ నన్ను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఆమె భారాసలో చేరారు. అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి భారాసలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. తమ్ముడిగా నన్ను మోసం చేశారు కాబట్టే ఆమెను నమ్మవద్దని కేటీఆర్‌కు చెప్పా. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే గెలిపించే బాధ్యత నాదే అని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. నేను చెప్పింది నిజమో.. కాదో.. సబితక్క గుండె మీద చేయి వేసుకుని చెప్పాలని రేవంత్ చెప్పారు. ఈ క్రమంలో కేటీఆర్ వెనకాల ఉన్న అక్కల మాట వినొద్దని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. వెల్ లోకి దూసుకొచ్చి ఆందోళన చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి వచ్చారని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిని తమ్ముడిగా పార్టీలోకి ఆహ్వానించానన్నారు. సీఎం రేవంత్ పదే పదే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే స్పీకర్ కలుగజేసుకుని సభా నాయకుడిని అగౌరవ పరుస్తున్నారని సబితకు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సబితా అనుభవించిన పదవులు మొత్తం అన్నీ ప్రస్తావించారు. '2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ సబితా ఇంద్రారెడ్డికి అనేక పదవులు ఇచ్చింది. కానీ.. సబితా ఇంద్రారెడ్డి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరి మోసం చేశారు. ఒక దశాబ్ద కాలం సబితకి మంత్రి

పదవి ఇచ్చాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుంటే సబిత బీఆర్ఎస్‌లోకి వెళ్ళారు.

కాంగ్రెస్ నన్ను సీఎల్పీ లీడర్ చేస్తే నా వెనక ఉండాల్సింది పోయి పదవి కోసం సబిత పార్టీ మారారు. ఓ దళితుడికి ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసేందుకు సబిత పార్టీ పదవి వెళ్లారు. పార్టీలు మారి, ప్రజాస్వామ్యాన్ని కూని చేసింది గాక ఇప్పుడు ఏదో మాట్లాడుతున్నారు. అసలు సబిత ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదు' అని భట్టీ ప్రశ్నలు, అంతకుమించి విమర్శల వర్షం కురిపించారు. ఈ క్రమంలోనే స్పీకర్ ఒకింత ఆగ్రహానికి లోనయ్యారు. 'కేటీఆర్ గారు రెచ్చగొట్టడమే మన పనా..?' అంటూ కోపంగా స్పీకర్ మాట్లాడారు. చర్చ పక్కదోవ పట్టడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు.

## నేడు వయనాడ్‌లో
### రాహుల్, ప్రియాంకల పర్యటన




న్యూఢిలీ:లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ గురువారం కేరళలోని వయనాడ్‌ను సందర్శించి కొండ చరియలు విరిగిపడిన దుర్ఘటన బాధితులను పరామర్శిస్తారని వర్గాలు తెలిపాయి. ముందుగా నిర్ణయించిన ప్రకారం రాహుల్, ప్రియాంక బుధవారం వయనాడ్‌ను సందర్శించవలసి ఉండగా భారీ వర్షం, ప్రతికూల వాతావరణం కారణంగా వారు అక్కడకు చేరుకోలేరని అధికారులు తెలియచేశారు. దీంతో వారిద్దరూ తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. మేప్పడిలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల, సెయింట్ జోసెఫ్ అప్పర్ ప్రైమరీ స్కూలులో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలను రాహుల్, ప్రియాంక గురువారం సందర్శిస్తారని వర్గాలు తెలిపాయి. మేప్పడిలోని డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజీని కూడా వారిద్దరూ సందర్శిస్తారని వారు చెప్పారు.

## సబితకు ఎలాంటి అగౌరవం జరగలేదు

హైదరాబాద్: రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యలు విమర్శించారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద బుధవారం మాట్లాడుతూ.. సబిత రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆదరించి చేరదీసిందని అన్నారు. అలాంటి పార్టీని మోసం చేసి మంత్రి పదవి కోసం బీఆర్ఎస్‌లో చేరారని విమర్శించారు. 'సబితా ఇంద్రారెడ్డి ఏ దిక్కూ లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆదరించింది. ఆమెతో కాంగ్రెస్ పార్టీకి సంబంధమే లేదు. భర్త చనిపోతే సబితకి పిలిచి టికెట్ ఇచ్చి, మంత్రిని చేశారు. దళిత నాయకుడు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీఎల్పీ నాయకుడు అయితే తట్టుకోలేకే సబిత పార్టీ మారారు. మహిళలను సీఎం రేవంత్ అవమానించారని సబిత అంటున్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించింది. మహిళలను ముఖ్యమంత్రులు, మంత్రులుగా చేసిందే కాంగ్రెస్ పార్టీ. పార్టీ వల్ల ఎదిగి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్న సబిత తీరును చూస్తుంటే చప్పట్లు కొడుతూ రన్నింగ్ కామెంటరీ చేసినట్లు ఉంది. రేవంత్ రైతు కుటుంబం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. ఆయన చరిత్ర నుంచి అనుభవాలు నేర్చుకుంటూ ఎదిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి తెలివి ఉంటే ఈ విషయాలు అర్థమయ్యేవి. ఆయన అసెంబ్లీలో పసలేని ఆరోపణలు చేస్తున్నారు. ప్రధాని మోదీ, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్, ఏపీ మాజీ సీఎం జగన్ లాంటి చాలామంది.. మంత్రులు కాకుండానే ముఖ్యమంత్రులు అయ్యారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్ల కేటీఆర్ మంత్రికాగలిగారు. రేవంత్ కింది స్థాయి నుంచి కష్టపడి సీఎం పదవి చేపట్టారు' అని సత్యనారాయణ పేర్కొన్నారు. మహిళలకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విమర్శించారు. సబిత ఇంద్రారెడ్డిని సభలో అగౌరవపరిచామని బీఆర్ఎస్ అబద్దాలు చెబుతోందని అన్నారు. కేసీఆర్ సభకు వస్తే ఆయన్ని ప్రశ్నించాలని అనుకున్నా. ఆ పార్టీలో అప్పుడైనా ఇప్పుడైనా మాట్లాడేది కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత మాత్రమే. బీఆర్ఎస్‌లో మాట్లాడే స్వేచ్ఛ ఉండదు. సభ అద్భుతంగా జరుగుతుందని మేధావులు అంటున్నారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం సభ మర్యాదను గంగలో కలుపుతున్నారు.

## హత్యాచారం కేసులో దోషికి మరణశిక్ష



**హైదరాబాద్,:** నగరంలోని నార్సింగిలో నాలుగున్నరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో దోషికి హైకోర్టు మరణ దండన విధించింది. 2018లో నార్సింగిలో చిన్నారిపై సెంట్రింగ్ కార్మికుడు దినేశ్ కుమార్ కిరాతకానికి ఒడిగట్టిన ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. ఈ కేసులో నిందితుడికి రంగారెడ్డి కోర్టు 2021లో ఉరిశిక్ష విధించగా.. ఆ తీర్పును అతడు హైకోర్టులో సవాల్ చేశాడు. అతడి పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. కింది కోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని సమర్థించింది.

## నేడు శ్రీశైలంలో సిఎం చంద్రబాబు పర్యటన
### కృష్ణమ్మకు జలహారతి ఇవ్వనున్న సిఎం



**నంద్యాల:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం శ్రీశైలంలో పర్యటించనున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కృష్ణమమకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లమల శ్రీశైలం అడవులను గ్రేహౌండ్స్, బాంబుస్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. శ్రీశైలం ఆలయం, జలాశయం వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రానా పరిశీలించారు. అనంతరం సుండిపెంట ప్రజావేదిక, హెలిప్యాడ్ ప్రాంతాలను వారు పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద బాంబు, డాగ్ స్క్వాడ్లతో పోలీసులు సైతం ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. సీఎం పర్యటన విజయవంతం అయ్యేలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS


# కవిత కస్టడీ 13 వరకు పొడిగింపు



**న్యూఢిల్లీ:** ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జుడిషియల్ కస్టడీని ఆగస్టు 13 వరకు ఢిల్లీ కోర్టు పొడిగించింది. బిఆర్ఎస్ ఎంఎల్సి కె కవిత కస్టడీని కూడా ప్రత్యేక న్యాయామూర్తి కావేరీ బవేజా ఆగస్టు 13 వరకు పొడిగిస్తూ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఇదే కుంభకోణానికి సంబంధించి సిబిఐ నమోదు చేసిన అవినీతి కేసులో సిసోడియా, కవితల జుడిషియల్ కస్టడీని ఆగస్టు 9 వరకు కోర్టు పొడిగించింది. ఇదివరకు విధించిన జుడిషియల్ కస్టడీ గడువు ముగియడంతో నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

# జీవన భృతి పెంపుకోసం ఉద్యమిస్తాం.

**2014 కటాఫ్ డేట్ ఎత్తివేయాలి.**
**కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలి.**
**తెలంగాణ బహుళజన బీడీ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, జుక్కల్, జులై 31:**





రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో బీడి కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని, బీడి జీవన భృతి రూ"4016 కు పెంచడంతో పాటు 2014 సంవత్సర కటాప్ డేట్ ఎత్తివేయాలని తెలంగాణ బహుళజన బీడీ కార్మికసంఘం (బిఎల్ టియూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు డిమాండ్. అసెంబ్లీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని, లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో
బీడీ కార్మికుల "చైతన్య సదస్సు" రాష్ట్ర కోషదికారి సయ్యద్ అధ్యక్షతన జరిగింది. సదస్సు కు ముఖ్య అతిధిగా తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు హాజరై, మాట్లాడారు.
తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి, చటన్, టేకేదార్ తదితర అన్ని తరగతుల కార్మికులకు 2016,రూ,ల జీవన భృతి ఇవ్వకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆంక్షలు విదించిందని అన్నారు. 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ డేట్ పెట్టడం వల్ల 2015 మార్చి నుండి పిఎఫ్ నెంబర్లు ఉన్న వేలాది మంది కార్మికులకు నేటికి జీవన భృతి రావడం లేదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కటాఫ్ డేట్ ఎత్తివేసి బీడి కార్మికులందరికీ రూ" 4016 జీవన భృతి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. కాని అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా బీడి కార్మికుల హామీలపై ఊసు ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ ను తక్షణమే ఎత్తి వేసి, బీడీ పరిశ్రమ లో పనిచేస్తున్న అందరికీ రూ"4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేదంటే తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆద్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమం చేపడుతామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్జిల్లా నాయకులు గంగాధర్, తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, కామారెడ్డి జిల్లా నాయకులు జి. సురేంద్రర్, బాలకృష్ణ, శంకర్, శంకర్, రాధ, సులోచన, జి.లక్ష్మి, లావణ్య, సుజాత తదితరులు బీడీ కార్మికులు, పాల్గొన్నారు.

# వివాదాస్పద ప్రొబేషనరీ పూజా ఖేడ్కర్ పై వేటు

**ఐఎఎస్‌ను రద్దు చేస్తూ యూపిపిఎస్సీ ఆదేశాలు**
**ఎలాంటి పరీక్షలకు హాజరు కాకుండా నిషేధం**



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా
ఖేడ్కర్ పై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈమేరకు అధికారులు బుధవారం ఆదేవాలు ఇస్తూ వివరాలు వెల్లడించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్ పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ ఖేడ్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే, దీనికి ఆమె నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించాం. కానీ, ఆమె ఆగస్టు 4 వరకు గడువు కావాలని కోరింది. ఇందుకు తిరస్కరించి.. జులై 30 వరకు అదనపు సమయం కల్పించాం. ఇదే చివరి అవకాశమని.. ఎలాంటి పొడిగింపులు ఉండవని స్పష్టంచేశాం. కానీ, ఆమె గడువులోగా తమ సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2022లో ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నాం. భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే నియామక పరీక్షలు/ఎంపికలకు హాజరుకాకుండా శాశ్వతంగా డిబార్ చేస్తున్నాం అని యూపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది. యూపీఎస్సీ పరీక్ష నిబంధనల్ని అతిక్రమిస్తూ అవకాశాలు వాడుకొని ఆమె నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించామని గతంలో కమిషన్ పేర్కొంది. తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్/సంతకం, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడ్డారని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆమె ప్రొబేషన్‌ను నిలిపివేసి.. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించగా ఆమె అక్కడికి వెళ్లలేదు. మరోవైపు, చీటింగ్-ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ నిమిత్తం ఆమె ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఆగస్టు 1వ తేదీన న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి.

**ప్రభుత్వ పాఠశాలలలో పారిశుధ్య కార్మికులను నియమించాలి.**
**బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్.**

**వేగుచుక్క న్యూస్ , హైదరాబాద్, జులై 31**



ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మిం చాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అసెంబ్లీలో సంక్షేమ హాస్టళ్ల దయనీయ పరిస్థితులను ప్రస్తావించడం పరిస్థితులకు అద్దం పడుతుందని అన్నారు. 1974 లో కట్టిన ఐలాపూర్ హాస్టల్ పేచ్చులూడి, స్టీలు రాడ్లు తేలి స్లాబ్ కూలడానికి సిద్ధంగా ఉందని, అదే హాస్టల్ లో ఉంటున్న పేద వర్గాలు, దళిత బిడ్డలు బిక్కు బిక్కు మంటూ ఉంటున్నారని, ఇది బంగారు తెలంగాణానా! తుప్పు పట్టిన తెలంగాణానా? అని అసెంబ్లీ సాక్షిగా రాకేష్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందన్నారు.
స్కూళ్ళలో బాత్ రూమ్ లు సరిగా లేవని, క్లాస్ రూమ్ లు ఊడ్చే కార్మికులు లేక ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందన్నారు. స్కూళ్లలో తరగతి గదులు బడి ఆవరణ
శుభ్రం చేసుకోవడం విద్యార్థులు పంతుల్ల వంతు అయిందని ఆరోపించారు. పాఠశాలల పారిశుధ్యం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఐతే ఇచ్చారు, కానీ ఇప్పటికే తగిన సిబ్బంది కొరతతో పాఠశాలల దిక్కు చూడడం లేదన్నారు. దీంతో పాఠశాలలలో పారిశుధ్యం పడకేసిందని ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వెంటనే స్కావేంజర్లను(పారిశుధ్య కార్మికులను) నియమించాలని డిమాండ్ చేశారు.

# జిఎస్టీ వాతలపై గళం విప్పిన గడ్కరీ



న్యూఢిల్లీ జిఎస్టీ వాతలపై ఇంతకాలం విపక్షాలు ప్రస్తావిస్తూ రాగా..తొలిసారిగా అధికార పక్షంలోనూ చర్చ మొదలయ్యింది. ఈ విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తొలిసారి పెదవి విప్పారు. ఇవేమి వాతలంటూ ఆర్థికమంత్రి దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు చెల్లిస్తున్నజీవిత, వైద్య బీమా ప్రీమియంలపై 18 శాతం వస్తు సేవల పన్ను జిఎస్టీని ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాశారు. లైఫ్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 18 శాతం జిఎస్‌టిని తగ్గించాలని ఆ లేఖలో కోరారు. ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై పన్ను విధించడం అంటే.. ఒక వ్యక్తి కష్టం, అనారోగ్యం పై పన్ను విధించినట్లేనని తెలిపారు. అదే విధంగా వైద్య బీమా ప్రీమియం రంగంపై 18 శాతం జిఎస్‌టి తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందన్నారు. జీవిత, వైద్య బీమా ప్రీమియంపై జీఎస్టీ చెల్లించడం సీనియర్ సిటిజన్లకు పెద్ద సవాలుతో కూడుకున్నదని తెలిపారు. ఈ అంశంపై పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై నాగ్‌పూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ తనకు మెమోరాండం సమర్పించిందని లేఖలో పేర్కొన్నారు. కాగా...

ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని పునపరిశీలించాలని నిర్మలా సీతారామన్‌కు గతంలో పలు మార్లు అభ్యర్థనలు వచ్చాయి. వ్యక్తిగత ఆరోగ్య పాలసీలపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని ఈ ఏడాది జూన్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సామాజిక భద్రతకు కొలమానంగా ఈ పాలసీలను కొనుగోలు చేసేలా ప్రజలను ప్రోత్సహించడంలో మీరు చేసే తగ్గింపు సహాయపడుతుందని నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంఘం తెలిపింది.

# పిడిఎస్ యూ ఛలో అసెంబ్లీ ముట్టడి.

## - విద్యార్థి, యువజన సంఘం నాయకుల అరెస్టు.






**వేగుచుక్క న్యూస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్ లో విద్య రంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పిడిఎస్ యూ, పివైఎల్ ఆధ్వర్యంలో ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. పెద్ద ఎత్తున విద్యార్థి, యువజన సంఘం నాయకులు తరలి రావడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనితో పోలీసులు విద్యార్థి, యువజన సంఘం నాయకుల ను అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్ లకు తరలించారు.**

# ప్రధాని మోడీతో డికె శివకుమార్ భేటీ

## బెంగళూరు అభివృద్ధికి సహకరించాలని వినతి



**బెంగళూరు:** కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. బెంగళూరు అభివృద్ధి, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మరిన్ని నిధులు ఇవ్వాలని కోరారు. గుజరాత్ గిఫ్ట్ సిటీ తరహాలో బెంగళూరును అభివృద్ధి చేయాలని కర్ణాటక ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని చెప్పారు. ఆ అభ్యర్థనను సానుకూలంగా పరిగణించకపోవడంతో టన్నెల్ ప్రాజెక్ట్, సిగ్నల్ రహిత కారిడార్, ప్రధాన రహదారులు, బెంగుళూరులో తుఫాను నీటి కాలువల అభివృద్ధి, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం మరిన్ని నిధులు కోరామని అన్నారు. కాగా, జాతీయ ఖజానాకు అత్యధిక పన్నులు అందజేసే రెండో మహానగరం బెంగళూరు అని డీకే శివకుమార్ తెలిపారు. అయితే కేంద్ర బ్జడెట్‌లో ఏమీ కేటాయించలేదని విమర్శించారు. అందుకే మౌలిక సదుపాయాలకు నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఎగువ తుంగభద్ర ప్రాజెక్టుపై గత బ్జడెట్‌లో రూ. 5,300 కోట్లు కేటాయించినప్పటికీ కేంద్రం ఎలాంటి నిధులను విడుదల చేయకపోవడాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. మరోవైపు తమిళనాడుకు నిర్దేశిత నీటి కంటే అదనపు నీటిని జూలైలో విడుదల చేయడంపై ప్రధాని మోదీకి వివరించినట్లు డీకే శివకుమార్ తెలిపారు. మహాదాయి సమస్యపై జోక్యం చేసుకోవాలని ప్రధానిని కోరినట్లు చెప్పారు. అయితే రెండు రాష్ట్రాలు ఈ సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించినట్లు వెల్లడించారు.




# రామాయణంలోకి అడుగు పెడుతున్న కునాల్



బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ దీన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి వార్తలు సోషల్ మీడియాలో ఎన్నోసార్లు వైరల్ కాగా.. తాజాగా ఈ భారీ ప్రాజెక్ట్‌లో మరో నటుడు భాగం కానున్నారనే వార్త తెగ షేర్ అవుతోంది. బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ 'రామాయణ'లో కీలకపాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ఆయనకు స్క్రీన్ టెస్ట్ కూడా నిర్వహించినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తన పాత్ర కోసం రిహార్సల్స్ చేస్తున్నారని టాక్. అయితే, ఈ పాత్రకు సంబంధించిన వివరాలను చిత్రబృందం గోప్యంగా ఉంచాలని భావిస్తోందట. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న 'విశ్వంభర'లోనూ కునాల్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆయన విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. 'రామాయణ' విషయానికొస్తే.. చిత్రాన్ని రెండు భాగాలుగా తీయాలని మేకర్స్ భావిస్తున్నారు. 2025 డిసెంబర్ నాటికి షూటింగ్ పూర్తి చేయాలనుకుంటున్నారు. దీని కోసం పన్నెండు భారీ సెట్లను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయోధ్య, మిథిలా నగరాలను తలపించేలా వాటిని తీర్చి దిద్దుతోందట మూవీ యూనిట్. 3డీ ఫార్మాట్‌లో, భారీ వ్యయంతో ముంబయిలో వీటిని రూపొందిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే దీని షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ చిత్రీకరణకు సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా సోషల్ మీడియాలో ఇటీవల సందడి చేశాయి.



# గేమ్ ఛేంజర్ నుంచి కియారా పోస్టర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు దిల్ రాజు , శిరీష్ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ట్రిపుల్ ఆర్ వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత రామ్ చరణ్ నటిస్తోన్న సినిమా అవడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే సినిమా నుంచి విడుదల చేసిన జరగండి అనే పాటను మంచి హైప్‌ను తీసుకువచ్చాయి. తాజాగా బుధవారం చిత్ర హీరోయిన్ కియారా అద్వాని పుట్టిన రోజును పురస్కరించుకుని 'గేమ్ చేంజర్' సినిమా నుంచి కియారా అద్వాని లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేస్తూ మా జాబిలమ్మకు జన్మదిన శుభాకాంక్షలు అంటూ పోస్టర్ విడుదల చేశారు. ఇదిలాఉండగా ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉండగా డిసెంబర్‌లో ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రముఖ తమిళ దర్శకుడు జిగర్తాండ పేమ్ కార్తీక్ సుబ్బరాజ్ ఈ సినిమాకు కథ అందించడం విశేషం. తమన్ సంగీతం అందిస్తున్నాడు.

# అల్లు అర్జున్ - శిల్పా రవి.. నిహారిక ఏం చెప్పిందంటే..


ఏపీలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అఖండ విజయాన్ని అందుకుంది. 100 శాతం స్ట్రైక్ రేట్ తో పోటీ చేసిన అన్ని స్థానాలలో జనసేన పార్టీ గెలుపొందింది. ఇదిలా ఉంటే ఎన్నికల ప్రచారం చివరి రోజున అల్లు అర్జున్ నంద్యాలలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డిని గెలిపించాలని క్యాంపైన్ చేశారు. ఆ క్యాంపైన్ జనసేన అభిమానులకి, మెగా ఫ్యాన్స్ కి కోపం తెప్పించింది.కావాలనే అల్లు అర్జున్ వైసీపీ అభ్యర్థి కోసం ప్రచారం చేశారనే విమర్శలు మొదలు పెట్టారు. ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడిచింది. ఎన్నికల



తర్వాతనాగబాబు పెట్టిన ఒక ట్వీట్ కూడా ఈ కాంట్రవర్సీని మరింత పైకి తీసుకెళ్లింది. ట్వీట్ చేసిన కొన్ని గంటల తర్వాత మరల దానిని డిలేట్ చేశారు. అయిన ఈ వివాదం మాత్రం ఆగలేదు.మెగా ఫ్యాన్స్, బన్నీ ఆర్మీ మధ్య సోషల్ మీడియాలో ఫైట్ నడుస్తూనే ఉంది. అల్లు అర్జున్ వైసీపీ తరుపున క్యాంపైన్ చేయడంతోమెగా హీరోల మధ్య దూరం పెరిగిందనే ప్రచారం తెరపైకి వచ్చింది. దీనిని కొద్దిరోజుల క్రితం బన్నీ వాస్ ఖండించారు. ఇదిలా ఉంటే తాజాగా నాగబాబు కూతురు నిహారిక ఓ ఇంటర్వ్యూలో ఈ వివాదంపై రియాక్ట్ అయ్యింది.

# విడుదలకు సిద్ధంగా రెండు భారీ సినిమాలు

15న రానున్న డబుల్ ఇస్మార్, మిస్టర్ బచ్చన్



రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రానున్న సినిమా 'డబుల్ ఇస్మార్ట్', అలాగే హీరో రవితేజ- డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ రెండు మూవీలు ఆగస్టు 15న విడుదల కానున్నాయి. తాజాగా వీటికి సంబంధించిన అప్‌డేట్స్ సోషల్ మీడియాలో సందడి చేస్తోన్నాయి. 'డబుల్ ఇస్మార్ట్'లో మాస్ పాత్రలో కనిపించనున్న రామ్ పోతినేని.. క్లాసీ లుక్‌లో తన పాత్రకు డబ్బింగ్‌ను పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వీడియోను పంచుకున్నారు. 'మాస్ మ్యాడ్‌నెస్‌కు సిద్ధమా' అనే క్యాప్షన్ పెట్టారు. మరోవైపు 'మిస్టర్ బచ్చన్' పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేసినట్లు కథానాయిక భాగ్యశ్రీ బోర్సే వెల్లడించారు. ఆమెకు ఇది టాలీవుడ్‌లో తొలి సినిమా అయినప్పటికీ స్వయంగా తెలుగు నేర్చుకొని తానే డబ్బింగ్ చెప్పారని చిత్రబృందం తెలిపింది. దీంతో సోషల్ మీడియాలో ఆమెపై ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి.'డబుల్ ఇస్మార్ట్' విషయాకిస్తే.. పూరి-రామ్‌ల హిట్ కాంబోలో తెరకెక్కిన 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా ఇది రానుంది. ఆ సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకోవడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే 'మిస్టర్ బచ్చన్' టీజర్, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించాయి. 'ప్రేక్షకుల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్తుంది చిత్రం' అని విడుదల చేసిన వీడియోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. యూట్యూబ్‌లోనూ భారీ వ్యూస్‌తో ట్రెండింగ్‌లో కొనసాగుతున్నాయి.

# రాజకీయాలకు దూరంగా ఉంటున్నా బడ్డీ ప్రమోషన్‌లో అలీ స్పష్టీకరణ




టాలీవుడ్‌లో కమెడియన్‌గా ఎంతో మంచి గుర్తింపు సంపాదించుకున్న వారిలో నటుడు అలీ ఒకరు. తన కామెడీ ద్వారా ప్రేక్షకులను నవ్వించి మెప్పించారు. అయితే ఈ నటుడు గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులు సినిమాలకు దూరంగా ఉండి వైసీపీలో చేరి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇక రాజకీయాల్లో ఉన్నప్పుడే తన ప్రాణ స్నేహితుడు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీదా కూడా విమర్శలు గుప్పించాడు. అలీ వైసీపీలో చేరినందుకు ఒకసారి పవన్ కళ్యాణ్ అలీ గురించి ఘాటుగా విమర్శలు గుప్పించగా.. అలీ అంతకు మించి స్వయంకృషితో నేను పైకొచ్చాను తప్ప నీలా చిరంజీవి వేసిన బాటలో రాలేదంటూ కౌంటరిచ్చారు. దీంతో ఇద్దరి మధ్య దూరం పెరిగిపోతూ వచ్చింది. అయితే ఏపీ ఎలక్షన్స్‌లో వైసీపీ ఓడిపోయిన అనంతరం అలీ రాజకీయలకు దూరంగా ఉంటూ వస్తున్నాడు. ముఖ్యంగా మళ్లీ తనకు నచ్చిన ఫీల్డ్‌లో సినిమాలు చేసుకుంటూ వెళు తున్నాడు. ఈ క్రమంలోనే ఆయన నటించిన బడ్డీ సినిమా విడుదలకు సిద్ధం అవుతుంది. అల్లు శిరిష్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రం ఆగష్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్స్ నిర్వహించగా.. ఈ ఈవెంట్‌లో శిరిష్‌తో పాటు అలీ పాల్గొన్నాడు. ప్రస్తుతం పాలిటిక్స్‌లో మీ పోజిషన్ ఏంటి అని అడుగగా.. అలీ సమాధానమిస్తూ.. నేను ఇప్పుడు ఏ పోజిషన్‌లో లేను.. ప్రస్తుతం రాజకీయల నుంచి చాలా దూరంగా వచ్చాను.



# బాలయ్య 50 ఏళ్ల సినీ ప్రస్థానం

సెప్టెంబర్ 1న ఘన సన్మానికి నిర్ణయం

నందమూరి బాలకృష్ణ 50ఏళ్ల సినీ ప్రయాణం సందర్భాన్ని పురస్కరించుకుని తెలుగు సినీ పరిశ్రమ ఆయనను ఘనంగా సన్మానించాలని నిర్ణయం తీసుకుంది.నందమూరి బాలకృష్ణ తొలిసారి నటించిన 'తాతమ్మ కల' సినిమా 1974 ఆగస్టు 30న విడుదలైంది. అంటే రానున్న ఆగస్టు 30కి బాలకృష్ణ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఈ క్రమంలో తెలుగు చలన చిత్ర వాణిజ్యమండలి కార్యదర్శి కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అధ్యక్షుడు సునీల్ నారంగ్, తెలుగు సినీ నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, తెలుగు సినీ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఇటీవల బాలకృష్ణని కలిసి, సన్మాన వేడుకు అంగీకరించాలని కోరగా అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేసథ్యంలో సెప్టెంబర్ 1న సాయంత్రం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా ఈ ఉత్సవం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ సన్మాన వేడుకకు దేశ వ్యాప్తంగా అన్ని సినిమా ఇండస్ట్రీలు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులను ఈ వేడుకకు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ సినిమా రంగానికి చేసిన, చేస్తున్న సేవలను ప్రస్తావిస్తూ ఓ ఆహ్వాన పత్రికను రూపొందించి విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ సినిమాల పరంగా సాధించిన రికార్డులను, రాజకీయాల్లో, సామాజిక కార్యమాల్లో ఆయన చేస్తున్న సేవలను పొందుపరిచారు. ఇప్పుడు ఈ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. మీరూ చూసేయండి.

# సామజవరగమన బ్యూటీ.. ఎంత అందంగా ఉందో..

గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి.. కడుపుబ్బా నవ్వించి సూపర్ హిట్ అయిన సామజవరగమన మూవీ హీరోయిన్ గుర్తుందా? అదేనండీ రెబా మోనిక జాన్. ఆ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ముద్దుగుమ్మ.. తన అందం, అభినయంతో అలరించింది. తెలుగులో స్పెషల్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. ఇప్పుడు ఇక్కడ వరుస అవకాశాలు అందుకుంటోంది అమ్మడు. ప్రస్తుతం సామజవరగమన హీరో శ్రీవిష్ణుతో మరో సినిమా కూడా చేస్తోంది.లెక్కల మాస్టర్ సుకుమార్ శిష్యుడు అయిన హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీ షూటింగ్ ఇప్పటికే చివరి దశలో ఉంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు మరో రెండు తెలుగు చిత్రాల్లో కూడా నటిస్తోంది రెబా మోనికా జాన్. బెంగళూరులోని మలయాళ ఫ్యామిలీకి చెందిన బ్యూటీ.. క్రైస్ట్ యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పట్టా పొందింది. ఆ తర్వాత మోడల్‌గా కొంత కాలం రానించింది. పలు బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ పాపులర్ అయింది.

అయితే సినిమాల్లోకి వచ్చే ముందు ధాత్రి హెయిర్ ఆయిల్ వంటి పలు యాడ్స్ లో నటించింది. 2016లో జాకోబింటె స్వర్గరాజ్యం మలయాళం ఫ్యామిలీ డ్రామా మూవీతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. రత్నన్ ప్రపంచం చిత్రంతో కన్నడలో తన లక్ ను టెస్ట్ చేసుకుంది. అలా తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వరుస సినిమాల్లో నటిస్తోంది. ఇప్పుడు తెలుగులో కూడా మెల్లగా బిజీ అవుతోంది రెబా మోనిక జాన్.అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది రెబా. ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ కోసం పిక్స్ షేర్ చేస్తుంటోంది. వెకేషన్స్ కు వెళ్తూ అక్కడి పిక్స్ ను పోస్ట్ చేస్తుంటోంది. పొట్టి బట్టలతో పాటు చీరల్లో అందాలు ఆరబోస్తుంటోంది. ఒక్కోసారి స్టైలిష్ లుక్స్‌తో మెస్మరైజ్ చేస్తుంటోంది అమ్మడు. సామజవరగమన తర్వాత తెలుగులో కూడా భారీగా ఫాలోవర్స్ పెంచుకుంటోంది.

తన లుక్స్ తో అట్రాక్ట్ చేస్తోంది. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసింది బ్యూటీ.పిక్ కలర్ మినీ స్కర్ట్ వేసుకుని రెబా.. నవ్వుతూ ఫుల్ హ్యాపీ మూడ్‌లో కనిపించింది. ఓ రిసార్ట్ లో దిగిన పిక్స్ తో సందడి చేసింది.

ప్రస్తుతం సోషల్ మీడియాలో రెబా కొత్త పిక్స్ ఫుల్ వైరల్ అవుతున్నాయి. రెబా అందానికి ఫిదా అయ్యామని చెబుతున్నారు నెటిజన్లు. లైకులు కొడుతూ సందడి చేస్తున్నారు.

